
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
గురువారం | 27 | ఏప్రిల్ | 2023



ఏసీబీ సోదాలు


స్పందనకు వచ్చిన ఫిర్యాదుల మేరకు డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాలతో తుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి నిరోధకశాఖ ఆకస్మిక సోదాలు నిర్వహించింది. 8లో▸



రత్నగిరి సత్రం గదులకూ ఆన్‌లైన్

రత్నగిరిపై గల శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం సత్రాలలో 50 శాతం గదులు ఆన్‌లైన్ రిజర్వేషన్ చేసుకునేందుకు వీలు కల్పిస్తున్నట్లు దేవస్థానం ఈఓ తెలిపారు. 8లో▸

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 3,500 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 800, మధ్య డెల్టాకు 200, పశ్చిమ డెల్టాకు 2,500 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజ్ వద్ద నీటిమట్టం 5.50 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

అముడ చైర్మన్‌గా డేవిడ్‌రాజు



ఉత్తర్వుల కాపీ అందజేస్తున్న జగ్గిరెడ్డి

కొత్తపేట: అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడ) చైర్మన్‌గా కొత్తపేటకు చెందిన సీనియర్ నాయకుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు నియమితులయ్యారు. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జె.శ్యామలరావు బుధవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల కాపీని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి డేవిడ్‌రాజుకు అందచేశారు. ఈ అముడ పరిధిలోకి అమలాపురం మున్సిపాలిటీ, ముమ్మిడివరం నగర పంచాయతీతో పాటు 120 గ్రామాలు వచ్చాయి. 7.50 లక్షల జనాభా ఈ అథారిటీ పరిధిలో ఉంది. ఆయా స్థానిక సంస్థలు, గ్రామాల పరిధిలో ఉన్న లేఅవుట్లు, 1,000 చదరపు మీటర్లు దాటిన భవనాలకు అనుమతులు అథారిటీ పరిధిలోకి వస్తాయి.

అమలాపురం డీఎస్పీగా కిషోర్‌కుమార్



కిషోర్‌కుమార్

అమలాపురం టౌన్: అమలాపురం పోలీసు సబ్ డివిజన్ కొత్త డీఎస్పీగా ఎం.కిషోర్ కుమార్ నియమితులయ్యారు. ప్రకాశం జిల్లా మార్కాపురం డీఎస్పీగా పనిచేస్తున్న కిషోర్‌కుమార్ బదిలీపై ఇక్కడకి వస్తున్నారు. ఇప్పటి వరకూ ఇక్కడ డీఎస్పీగా పనిచేసిన వై.మాధవరెడ్డి కృష్ణాజిల్లా మచిలీపట్నం డీఎస్పీగా బదిలీ అయ్యారు. గ్రూప్–1 ఆఫీసర్లైన మాధవరెడ్డి, కిషోర్‌కుమార్‌లు నేరుగా డీఎస్పీలైన వారే. 2020 నవంబర్ 20న అమలాపురం డీఎస్పీగా వచ్చిన మాధవరెడ్డి గత రెండున్నరేళ్లలో నేరాల అదుపునకు కృషి చేశారు. ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు, కోనసీమ జిల్లా అయిన తర్వాత కూడా అమలాపురం డీఎస్పీగా మాధవరెడ్డి సమర్థంగా పనిచేశారన్న పేరు తెచ్చుకున్నారు. మాధవరెడ్డికి ముందు అమలాపురం డీఎస్పీగా పనిచేసిన షేక్ మసూమ్ బాషా గతంలో ఇక్కడ నుంచి బదిలీపై మచిలీపట్నం డీఎస్పీగా వెళ్లారు. ఇప్పుడు బదిలీ అయిన డీఎస్పీ మాధవరెడ్డి కూడా బదిలీపై మచిలీపట్నమే వెళుతున్నారు. రెండు రోజుల్లో కిషోర్ కుమార్ బాధ్యతలు స్వీకరించనున్నారు.

హైస్కూల్ పీడీ సస్పెన్షన్

మామిడికుదురు: అప్పనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ (పీడీ)గా పనిచేస్తున్న పి.సురేష్‌బాబును సస్పెండ్‌చేస్తూ డీఈఓ ఎం.కమలకుమారి ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలు బుధవారం తమకు అందాయని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.సాయిబాబు ధ్రువీకరించారు. వీటిని వెంటనే అమలు చేస్తామన్నారు. పాఠశాల విద్యార్థిని పట్ల పీడీ అసభ్యంగా ప్రవర్తించారన్న ఆరోపణలపై డీఈఓ ఆదేశాల మేరకు ఎంఈఓ కె.హెలీనా విచారణ జరిపారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ కూడా విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదించారు. విద్యార్థినిల పట్ల పీడీ అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని పేరెంట్స్ నుంచి వచ్చిన ఆరోపణలపై మార్చి 28న ప్రచురితమైన కథనాలపై స్పందించిన అధికారులు విచారణకు ఆదేశించారు. నివేదికల ఆధారంగా పీడీని సస్పెండ్ చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.

అమ్మాయిలే మిన్నగా..

- ఇంటర్ ఫలితాల్లో బాలికలదే పై చేయి
- ప్రథమ సంవత్సరంలో 59 శాతం ఉత్తీర్ణత
- ద్వితీయ సంవత్సరంలో 69 శాతం ఉత్తీర్ణత
- రాష్ట్రంలో జిల్లాకు గతం కంటే మెరుగైన స్థానం



కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలు బుధవారం సాయంత్రం వెలువడ్డాయి. ఎప్పటిలాగే ఈసారి కూడా జిల్లాలో బాలికలే పైచేయిగా సాధించారు. ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో వీరే హవా చాటుకున్నారు. ఇంటర్మీడియెట్ పరీక్షలు మార్చి 15 నుంచి ఈ నెల నాలుగో తేదీవరకు జరిగాయి. మునుపెన్నడూ లేని విధంగా పరీక్షలకు సంబంధించి మూల్యాంకనం అత్యంత వేగవంతంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీంతో పట్టుమని పది రోజులు కూడా పూర్తవ్వకుండానే ఫలితాలు వెలువడ్డంతో విద్యావర్గాలు విస్తుపోయాయి. తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్లు స్వయంగా పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు. వీరు రోజూ పరీక్ష కేంద్రాలను సైతం పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మాల్ ప్రాక్టీసుకు అవకాశం లేకుండా పకడ్బందీగా నిర్వహించడంలో సఫలీకృతమయ్యారు.

ఫలితాల్లో ముందడుగు

తాజాగా విడుదలైన ఫలితాల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తన స్థానాన్ని కొంచెం మెరుగుపరచుకోగలిగింది. గతేడాది 12వ స్థానంలో డీలాపడిన జిల్లా ఈసారి ఎనిమిదో స్థానానికి ఎగబాకింది. ఈ స్థానానికి మించి వచ్చే ఏడాది మరింత ముందుకు వెళ్తామని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లా పరిధిలో 42,137 మంది ప్రథమ సంవత్సరం పరీక్షలు రాశారు. వీరిలో 24, 886 మంది ఉత్తీర్ణులయ్యారు. 59 శాతం ఉత్తీర్ణత నమోదయింది. ఇందులో బాలురు 18,646 మందికి గాను 10,332 మంది పాసై 55 శాతం నమోదు చేయగలిగారు. 23,491 మంది బాలికలకు గాను 14,554 మంది పాసయ్యారు. వీరి ఉత్తీర్ణత శాతం 62 సాధించి బాలుర కంటే ముందంలో నిలిచారు. ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు 36,835 మంది రాయగా 25,330 మంది ఉత్తీర్ణులయ్యారు. 69 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. 15712 మంది బాలురకు గాను 10,993 మంది పాసై 64 శాతం సాధించారు. 21121 మంది బాలికలకు గాను 15237 మంది ఉత్తీర్ణులయ్యారు. 72 శాతంతో పైచేయిగా నిలిచారు. ఈ ఫలితాల్లో అత్యధికంగా మార్కులు సాధించిన వారు ఎక్కువ మందే ఉండటం విశేషం.

8వ స్థానానికి చేరుకున్నాం



ఇంటర్ పరీక్షల్లో జిల్లా ముందంజ వేసింది. గత ఏడాది 12వ స్థానంలో ఉండగా ఈ ఏడాది 8వ స్థానానికి చేరుకున్నాం. ప్రతి పరీక్షా కేంద్రంలో నూటికి నూరుశాతం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాం. ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. రెగ్యులర్ అధ్యాపకులతో పాటు కాంట్రాక్టు అధ్యాపకులు ఉత్తీర్ణత శాతం పెరిగేందుకు దోహదపడ్డారు. విద్యార్థులు కష్టపడి చదివారు. అనుకున్న ఫలితాలు సాధించాం.

– ఐ.శారద, రీజినల్ జాయింట్ డైరెక్టర్, జోన్ 1, 2

గత మూడేళ్లలో జిల్లా ఉత్తీర్ణత శాతం

సంవత్సరం	ఫస్టియర్ రాసినవారు	ఉత్తీర్ణులు	శాతం
2020	48,578	28,277	58.21
2022	32,890	18,895	57.00
2023	42137	24,886	59.00
సంవత్సరం	సెకండియర్ రాసినవారు	ఉత్తీర్ణులు	శాతం
2020	49,479	25,975	57.11
2022	41,446	23,954	58.00
2023	36,835	25,330	69.00

(2021లో కరోనా వల్ల నూరుశాతం ఉత్తీర్ణులుగా ప్రకటించారు)

ఇంజనీరు కావాలన్నదే లక్ష్యం



సాఫ్ట్‌వేర్ రంగంలో ఓ ఇంజనీర్‌గా స్థిరపడాలన్నదే నా లక్ష్యం. మొదటి సంవత్సరం నుంచి కష్టపడి చదివాను. ఊహించినట్టుగానే మార్కులు వచ్చాయి. అమలాపురం విద్యానిధి జూనియర్ కళాశాలలో చదువుకున్నాను.

– జైను భవ్య దత్తశ్రీ, అమలాపురం, 990

ఏఎఫ్ఎంసీలో సీటు లక్ష్యం



నాన్న నాగసుబ్రహ్మణ్యం ఫార్మాసిస్ట్, అమ్మ నాగలక్ష్మి గృహిణి. మాది కోనసీమజిల్లా జగ్గన్నపేట. లెక్చరర్ల గైడెన్స్‌తో మంచి మార్కులు సాధించా. ఆర్మ్‌డ్ ఫోర్స్ మెడికల్ కళాశాల(ఏఎఫ్ఎంసీ)లో సీటు సాధించడమే లక్ష్యం.

–దయవపు కార్తీక్, బైపీసీ, 989

అంకాలజీలో స్పెషలైజేషన్ చేస్తా..



నాన్న సత్యనారాయణ రైతు, అమ్మ ధనలక్ష్మి గృహిణి. మాది ఏలూరు జిల్లా బుట్టాయగూడెం. ఎంబీబీఎస్ పూర్తి చేసిన తరువాత అంకాలజీలో స్పెషలైజేషన్ చేయాలన్నది తన ఆకాంక్ష.

–గుబ్బల మేఘన, బైపీసీ, 989

కంప్యూటర్ సైన్స్‌లో సీటు సాధిస్తా



ఐఐటీ మెయిన్స్‌లో 9.998 సాధించాను. ముంబయిలో కంప్యూటర్ సైన్స్‌లో సీటు సాధించడమే లక్ష్యం.

– రాఘవేంద్ర, రాజమండ్రి, 983

వైద్యసేవలందించాలని...



నాన్న సత్తిబాబు తాపీమేస్త్రీ, అమ్మ రామలక్ష్మి గృహిణి. మాది అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం బలిగట్టం. డాక్టర్ ఉండాలనే తల్లిదండ్రులు కోరిక మేరకు బైపీసీ తీసుకున్నా. ఎయిమ్స్‌లో సీటు సాధించి డాక్టర్ చదివి పేదలకు వైద్యసేవలందిస్తా.

– ఎం.గంగాతల్లి, బైపీసీ, 990

వైద్యవృత్తి అంటే ఇష్టం



నాన్న రుద్రరాంగోపాల్, అమ్మ శివసుజాతలు ప్రభుత్వ టీచర్లు. మాది యానాం. చిన్నప్పటి నుంచి వైద్య వృత్తి అంటే ఇష్టం. అందువలన బైపీసీ తీసుకుని లెక్చరర్లు సూచనలు,సలహాలతో శ్రద్ధతో చదవడంతో ఉత్తమమార్కులు సాధించాను.

– పిల్లి మహిమాన్విత, బైపీసీ, 989

కార్డియాలజిస్టును అవుతా..



నాన్న ఫణికుమార్ ప్రైవేటు కంపెనీలో మేనేజర్, అమ్మ అన్నపూర్ణ గృహిణి. మాది రాజోలు. డాక్టర్ కావాలన్న ఆకాంక్షతో బైపీసీ తీసుకున్నా. ఎంబీబీఎస్ పూర్తి చేసి కార్డియాలజిస్ట్ కావాలన్నదే తన లక్ష్యం.

–కొల్లశ్రీమధురిమ, బైపీసీ, 989

అధ్యాపకుల ప్రోత్సాహం



నాన్న వలీబాబా వీఆర్వో, అమ్మ షేక్ షఫీ గృహిణి. వారిద్దరూ, అధ్యాపకుల సహకారంతోనే కష్టపడి చదివాను.

– షేక్ ఆయూషా, తొండంగి, 982

మరో 110 సెల్‌ఫోన్లు రికవరీ

- చాట్‌బాట్ యాప్‌తో వేగంగా దర్యాప్తు
- ఎస్పీ శ్రీధర్



రికవరీ చేసిన సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న ఎస్పీ శ్రీధర్, ఏఎస్పీ లతామాధురి

అమలాపురం టౌన్: పోలీసు శాఖ కొత్తగా రూపొందించిన చాట్‌బాట్ యాప్ ద్వారా జిల్లాలో రెండో విడత 110 సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్టు ఎస్పీ సుసరాపు శ్రీధర్ వెల్లడించారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ కె.లతామాధురితో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే జిల్లాలో ఈ యాప్ ద్వారా తొలి విడతగా ఇటీవల 85 ఫోన్లు రికవరీ చేసినట్లు చెప్పారు. రికవరీ చేసిన 110 ఫోన్లను పోగొట్టుకున్న బాధితులకు ఎస్పీ, ఏఎస్పీలు విలేకరుల సమావేశానంతరం అందజేశారు. మరో 200 సెల్‌ఫోన్లకు సంబంధించి ఈ యాప్‌నకు అందిన ఫిర్యాదులతో లోతుగా దర్యాప్తు చేస్తున్నామని..త్వరలోనే వాటిని కూడా రికవరీ చేస్తామన్నారు. యాప్ ద్వారా వేగంగా రికవరీ చేస్తున్న క్రైమ్ సీఐ డి.గోవిందరావు, ఎస్బీ సీఐ కోలా రజనీ కుమార్, ఐడీ పార్టీ ఏఎస్ఐ అయితాబత్తుల బాలకృష్ణ, దర్యాప్తు బృందాన్ని ఎస్పీ అభినందించారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను విధిగా వినియోగించుకోండి

వేసవి కాలంలో పగలు, రాత్రి సమయాల్లో చోరీలు ఎక్కువ జరిగే అవకాశం ఉంటుందని ఎస్పీ శ్రీధర్ తెలిపారు. ముఖ్యంగా వేసవి సెలవుల్లో వేరే ఊళ్లకు వెళ్లే వారు జిల్లా పోలీసు శాఖ అమలు చేస్తున్న లాక్డ్ హౌస్ మోనటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్)ను ఇంటికి ఏర్పాటు చేసుకుని ధీమాగా ఉండాలని ఎస్పీ శ్రీధర్ సూచించారు. జిల్లాలోని మూడు పోలీసు సబ్ డివిజన్లలో ఈ ఎల్‌హెచ్‌ఎంఎస్ సదుపాయం ఉందన్నారు. ఊర్లె్ల ముందు సంబంధిత పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇస్తే పోలీసులు ఆ ఇంటికి వచ్చి ఎల్‌హెచ్‌ఎంఎస్ పరికరాన్ని అమర్చి వెళతారని తెలిపారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ వల్ల ఆ ఇంట్లోకి ఎవరు చొరబడినా క్షణాల్లో తెలుస్తుందని స్పష్టం చేశారు.

వ్యాపారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

నేరాలు, చోరీల అదుపునకు పోలీసులు తీసుకుంటున్న చర్యలతో పాటు వ్యాపారులు కూడా తమ షాపుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ శ్రీధర్ సూచించారు. షాపుల్లో ఏర్పాటు చేసుకునే కెమెరాలతోపాటు రోడ్డు వ్యూ కనిపించేలా ఒకట్రెండు కెమెరాలు అమర్చుకుంటే నేరాల అదుపునకు పోలీసులకు తోడ్పడతాయని ఎస్పీ శ్రీధర్ వివరించారు.

విద్యారంగంలో సంస్కరణల విప్లవం

- జిల్లాలో వసతి దీవెనతో 33,344 మందికి రూ.31.74 కోట్ల లబ్ధి
- కలెక్టర్ హిమాన్షు శుక్లా



విద్యార్థులు, తల్లులకు జగనన్న విద్యావసతి నమూనా చెక్‌ను అందజేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, ఎమ్మెల్యేలు సతీష్‌కుమార్, చిట్టిబాబు

అమలాపురం టౌన్: జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన పథకాల ద్వారా విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు సాధ్యమవుతున్నాయని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. అందుకే నేటి విద్యార్థుల్లో విద్యా సంకల్పం బలపడుతోందని పేర్కొన్నారు. అనంతపురం జిల్లా నార్పల నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి మొదటి విడతగా జగనన్న వసతి దీవెన నిధులను తల్లుల ఖాతాలకు బుధవారం బటన్ నొక్కి జమ చేశారు. కలెక్టరేట్ నుంచి కార్యక్రమంలో కలెక్టర్ శుక్లా పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పథకం లబ్ధిదారులైన విద్యార్థులు, తల్లులతో కలెక్టర్ శుక్లా మాట్లాడారు. కలెక్టర్‌తోపాటు ముమ్మిడివరం, పి.గన్నవరం ఎమ్మెల్యేలు పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, కొండేటి చిట్టిబాబు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ కూడా మాట్లాడారు. కలెక్టర్ శుక్లా మాట్లాడుతూ జిల్లాలో ఈ పథకం కింద మొత్తం 33,344 మంది విద్యార్థులకు రూ.31.74 కోట్ల మేర లబ్ధి చేకూరిందని వెల్లడించారు. కార్పొరేట్ స్కూళ్లకు ఏ మాత్రం తీసిపోకుండా విద్యాలయాలను సంస్కరించి ప్రభుత్వ విద్యాబోధనను పూర్తి నాణ్యతగా మార్చారని కలెక్టర్ శుక్లా గుర్తు చేశారు. ఇప్పటికే నాడు–నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలల్లో అనూహ్య అభివృద్ధి సాధ్యమైందన్నారు. మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫారాలు, బూట్లు, టైలు వంటి సదుపాయాలే కాకుండా ఎనిమిదో తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు అందించిన విషయాన్ని కలెక్టర్ శుక్లా వివరించారు. ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, ఎమ్మెల్యేలు సతీష్‌కుమార్, చిట్టిబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వం విద్యకు ఇస్తున్న ప్రాధాన్యతతో విద్యాలయాల ప్రగతే కాదు అందులో చదువుతున్న విద్యార్థుల ప్రణాళికాబద్ధమైన భవిష్యత్తుకు పునాదిరాళ్లు పడుతున్నాయని గుర్తు చేశారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లులకు కలెక్టర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు రూ.31.74 కోట్ల నమూనా చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, తల్లులు జగనన్న వసతి, విద్యా దీవెనలు తమకెంత ప్రయోజనకారిగా ఉన్నాయో వివరించారు. అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి మునికుమారి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జేడీ వి.జ్యోతిలక్ష్మి, బీసీ వెల్ఫేర్ అధికారి టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పీఎంశ్రీతో రాబడులు

- తొలి విడతలో 21 స్కూళ్ల ఎంపిక
- నేరుగా పాఠశాలలకు జమకానున్న నిధులు
- యూడైస్ 2021–22 ప్రామాణికంగా సమాచార సేకరణ



పీఎంశ్రీ పథకానికి ఎంపికైన పాఠశాల

రాయవరం: ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం మనబడి నాడు–నేడు పథకం ద్వారా అభివృద్ధి పట్టాలెక్కించింది. రాష్ట్ర ప్రభుత్వం బాటలో కేంద్రం కూడా ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎం–శ్రీ) పథకాన్ని ప్రవేశపెట్టిన విషయం పాఠకులకు విదితమే. పాఠశాలల్లోని విద్యార్థుల సమగ్ర ప్రగతి లక్ష్యంగా నేరుగా ఆయా పాఠశాలలకు నిధులను ఈ పథకం ద్వారా అందజేస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు హై క్వాలిటీ ఎడ్యుకేషన్‌ను ఈ పథకం ద్వారా అందించనున్నారు. యూడైస్ 2021–22 ద్వారా విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకుని గతేడాది సంబంధిత పాఠశాలల హెచ్ఎంలు పీఎంశ్రీకి దరఖాస్తు చేశారు. ఇటీవలనే పీఎంశ్రీ పథకంలో ఎంపిక చేసిన మొదటి విడత పాఠశాలల జాబితాను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 21 పాఠశాలలు ఈ పథకం కింద ఎంపికయ్యాయి.

ఎంపిక ప్రక్రియ.. విధి విధానాలు

కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాల నిర్వహణలోని పాఠశాలలు దరఖాస్తు చేసుకోగా, మూడంచెల ప్రక్రియ ద్వారా పాఠశాలలను ఎంపిక చేశారు. దరఖాస్తు సమయంలో విధివిధానాలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలకు 60 శాతం, పట్టణాల్లో ఉన్న పాఠశాలలకు 70 శాతం మార్కులు సాధించిన పాఠశాలలు పథకానికి అర్హత పొందాయి. ఆయా పాఠశాలలే నిర్దేశించిన ఫార్మాట్‌లో సంబంధింత వెబ్‌సైట్లో గతేడాది నవంబరు 18లోగా దరఖాస్తు చేసుకున్నాయి. ఎంపికైన పాఠశాలలను జియో ట్యాగింగ్ చేసి, కార్యకలాపాలను సమీక్షిస్తారు. జిల్లాలో 431 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు దరఖాస్తు చేసుకున్నాయి. 242 పాఠశాలలు అర్హత సాధించాయి. ఎంపికైన పాఠశాలలను రాష్ట్ర విద్యాశాఖ నుంచి నియమితులైన జిల్లా పరిశీలకులు సందర్శించి, వాటిలో మరింత ఉత్తమమైన 44 పాఠశాలలను ఎంపిక చేశారు. అలా తయారైన ఫైనల్ జాబితా నుంచి కేంద్ర విద్యాశాఖ అధికారులు తొలి విడతగా 21 పాఠశాలలను పీఎం–శ్రీ పథకానికి ఎంపిక చేశారు. ఎంపికైన పాఠశాలలను పర్యావరణానికి అనుకూలంగా గ్రీన్ స్కూల్స్‌గా మార్చాలి. పాఠశాలల్లో సోలార్ ప్యానెళ్లను, ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేసుకోవడంతో పాటుగా, విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి సేంద్రియ విధానంలో కూరగాయలు పండించాలి. పాఠశాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలి.

బడ్జెట్ తయారీపై మార్గదర్శకాలు

ఎంపికైన పాఠశాలలకు బడ్జెట్ తయారీని చేపట్టనున్నారు. ఈ మేరకు సమగ్ర శిక్షా రాష్ట్ర కార్యాలయం నుంచి మార్గదర్శకాలు విడుదల చేశారు. ఈ నెల 27వ తేదీలోగా పాఠశాల, జిల్లా స్థాయిలో చాప్టర్స్ ఆఫ్ స్కూల్స్ డ్రాఫ్ట్ ప్రిపరేషన్ చేయాల్సి ఉంది. వచ్చే నెల 2వ తేదీలోగా ఫైనల్ వెరిఫికేషన్ అనంతరం రాష్ట్ర స్థాయికి నివేదించాల్సి ఉంటుంది.

ప్రయోజనాలివీ

- ఎంపికై న పాఠశాలలకు నేరుగా కేంద్ర ప్రభుత్వం నిధుల కేటాయింపు
- డిజిటల్ పద్ధతిలో బోధన, ప్రయోగశాలలు తదితర సౌకర్యాల కల్పన
- ఉపాధ్యాయులకు అవసరమైన శిక్షణ
- ఐదేళ్ల వరకు ఆర్థిక, సాంకేతిక సహకారం

అవగాహన కల్పించాం



పీఎంశ్రీ పథకంలో ఎంపికైన పాఠశాలల హెచ్ఎంలకు వెబెక్స్ ద్వారా సమావేశం నిర్వహించాం. పీఎంశ్రీ యాప్‌లో ఏ విధంగా ఎన్‌రోల్ కావాలో తెలియజేసి, బడ్జెట్ రూపకల్పనపై అవగాహన కల్పించాం. ఈ పథకం ద్వారా ఎంపికైన పాఠశాలల్లో కార్పొరేట్ తరహాలో అన్ని సౌకర్యాలతో విద్య అందుబాటులోకి వస్తుంది.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

బీమాపై ఆశల ధీమా

- న్యాయస్థానం ఉత్తర్వులతో రైతులకు ఊరట

సాక్షిప్రతినిధి,కాకినాడ: నాలుగేళ్ల నాటి పంటల బీమా తమ చేతికొస్తుందా కొండెక్కిపోతుందా అనే రైతుల మీమాంసకు తెరపడింది. ఈ బీమా విషయంలో కోర్టు ఇచ్చిన తాజా ఆదేశాలతో వీరికి మరింత ధీమా లభించింది. బీమా క్లెయిమ్‌లో 50శాతం ముందుగానే తమ వద్ద జమచేయాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేయడం కొండంత ఉపశమనాన్ని ఇచ్చింది. బీమా వ్యవహారంపై 'సాక్షి' వరుస కథనాలను ప్రచురించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లిన సంగతి తెలిసిందే. దీంతో ప్రభుత్వం విచారణకు ఆదేశించాక అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయి.

అసలు జరిగిందేమిటంటే...

2019 ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి విపత్తుతో రైతులు పంట నష్టపోయారు. ఆ ఏడాది సెప్టెంబరు 12లోగా బీమా కోసం ప్రీమియం చెల్లించాల్సి ఉంది. రైతు రూపాయి చెల్లిస్తే మొత్తం ప్రీమియం భరించేలా అప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయినప్పటికీ అప్పటి ప్రధాన మంత్రి ఫసల్ బీమాయోజన లైజనింగ్ అధికారి శ్రీధర్‌చౌదరి, నోడల్ అధికారులు అలసత్వం ప్రదర్శించారు. గడువు ముగిసిపోయాక ప్రీమియం చెల్లించారు. దీంతో బీమా రాక రైతులు నష్టపోయారు. వాస్తవానికి రైతులు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు రూపాయి వంతున కట్టేశారు. ఈ మొత్తాన్ని బ్రాంచిల నుంచి ఇన్సూరెన్సు కంపెనీకి చెల్లించారు. కొన్ని బ్రాంచిల నుంచి బీమా కంపెనీకి సరిగా జమకాలేదు. గడువులోగా జమ కాలేదనే కారణంతో క్లెయిమ్‌లను బీమా కంపెనీ తిరస్కరించింది. సుమారు 14వేల మంది రైతులు రూ.15.47 కోట్ల మేర నష్టపోవాల్సి వచ్చింది. దీనిపై అప్పటి వ్యవసాయ, సహకారశాఖా మంత్రి కురసాల కన్నబాబు విచారణ జరిపించారు. ప్రీమియం చెల్లింపులో జాప్యానికి సీఈఓ, ఒక డీజీఎం, నోడల్ అధికారులు సహా పలువురు బాధ్యులని నిర్ధారించారు. 41 మందికి అప్పట్లో చార్జి మెమోలు కూడా ఇచ్చారు. సహకారశాఖ రిజిస్ట్రార్ డీసీసీబీ ద్వారా వినియోగదారుల ఫోరంలో కేసు వేయించారు. రైతులకు బీమా చెల్లించాల్సిందేనని ఫోరం ఇటీవల తీర్పు ఇచ్చింది. దీనిపై ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. రైతులు నష్టపోవడానికి వీలులేదంటూ బీమా క్లెయిమ్‌లో 50శాతం ముందుగానే కోర్టులో జమచేయాలని న్యాయస్థానం తాజాగా ఆదేశించింది. జూన్ 20కి కేసు వాయిదా వేసింది. బ్రాంచ్‌లు, సొసైటీలు ఏ స్థాయిలో అయినా రైతులకు బీమా క్లైమ్ సకాలంలో అందేటట్లు చూడాల్సిన బాధ్యత ఉందని ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయమిషన్ సభ్యుడు జున్నూరి రామారావు (బాబి) వ్యాఖ్యానించారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో ఒడిశా యువకుడి మృతి

అమలాపురం టౌన్: పట్టణ సమీపంలో గల విశ్వేశ్వర అగ్రహారంలో ఓ కోళ్ల ఫారంలో పనిచేసేందుకు ఒడిశా రాష్ట్రం నుంచి వచ్చిన యాలం దినేష్ (22) పనిచేసే చోటే మంగళవారం అర్ధ రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పట్టణ ఎస్సై జి.హరీష్‌కుమార్ బుధవారం ఉదయం ఘటనా స్థలంలో విచారించారు. ఏడాది కిందట ఒడిశా రాష్ట్రం నుంచి ఉపాధి కోసం ఈ కోళ్ల ఫారానికి వచ్చి పనిచేస్తున్నాడు. తెల్లవారే సరికి చనిపోయి ఉండడంతో కోళ్లఫారం యాజమాని సమాచారంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. అయితే మృతుడు దినేష్ శరీరంపై ఎలాంటి గాయాలు లేవు. అతనికి పెళ్లి కాలేదు. అతను ఎలా చనిపోయిందీ విచారణలో తేలాల్సి ఉందని, అనుమానా స్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై హరీష్‌కుమార్ తెలిపారు. ఒడిశా రాష్ట్రం నుంచి దినేష్ కుటుంబీకులు వచ్చే వరకూ అతని మృతదేహాన్ని అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని మార్చురీలో ఉంచుతామని తెలిపారు.

బ్లాక్ మెయిలింగ్ కేసులో నిందితుడి అరెస్టు

మామిడికుదురు: బ్లాక్‌మెయిలింగ్ పాల్పడిన కేసులో కొమరాడకు చెందిన కొడమంచిలి సాయికుమార్‌ను బుధవారం అరెస్టు చేశామని నగరం ఎస్సై షేక్ జానీబాషా తెలిపారు. అతడిని రాజోలు మేజిస్ట్రేటు ముందు హాజరు పర్చామన్నారు. ఈదరాడ గ్రామానికి చెందిన ఆర్ఎంపీ యెరుబండి సత్యనారాయణమూర్తి స్పందనలో జిల్లా ఎస్పీ శ్రీధర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సాయికుమార్‌పై కేసు నమోదు చేశామన్నారు. వైద్యం చేసేందుకు సాయికుమార్ ఇంటికి వెళ్లిన ఆర్ఎంపీతో బలం ఇంజెక్షన్ చేయించుకున్నాడని చెప్పారు. అది వికటించిందని చెప్పి, రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడని, లేనిపక్షంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతానని బెదిరించాడన్నారు. బ్లాక్ మెయిలింగ్ చేస్తున్న సాయికుమార్ ఆర్ఎంపీ సత్యనారాయణమూర్తి ఇంటికి వెళ్లి అతని జేబులో నుంచి బలవంతంగా రూ.నాలుగు వేలు తీసుకుని వెళ్లిపోయాడని ఎస్పీకి ఫిర్యాదు చేశారు. వీటిపై విచారణ జరిపించి నిందితుడిని అరెస్టు చేశామని ఎస్సై చెప్పారు. నిందితుడు సాయికుమార్‌పై నగరం, రాజోలు పోలీస్ స్టేషన్లలో ఛీటింగ్, బ్లాక్ మెయిలింగ్‌లకు సంబంధించి మొత్తం ఏడు కేసులు నమోదయ్యాయన్నారు.

వ్యక్తి మృతిపై కేసు

యానాం: పట్టణ పరిధిలో వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్ఐ శేరు నూకరాజు బుధవారం తెలిపారు. స్థానిక యానాం బైపాస్ రహదారి శక్తి వైన్స్ వెనుకభాగంలో మృతదేహాన్ని కనుగొన్నామన్నారు. మృతుడు కాజులూరు మండలం ఏజీకేపేటకు చెందిన రేఖాడి దశరథ మహారాజు(47)గా గుర్తించినట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం యానాం జీజీహెచ్‌కు తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

- అనధికారికంగా ఉన్న రూ.40,850 స్వాధీనం

తుని: స్పందనకు వచ్చిన ఫిర్యాదుల మేరకు డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాలతో తుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి నిరోధకశాఖ ఆకస్మిక సోదాలు నిర్వహించింది.బుధవారం సాయంత్రం ఏసీబీ అడిషనల్ ఎస్పీ సౌజన్య మీడియాకు వివరాలను వెల్లడించారు. స్పందన, 14400 నంబరుకు పలువురు తుని కార్యాలయంలో జరుగుతున్న అక్రమ వసూళ్లపై ఫిర్యాదు చేశారన్నారు. దీంతో సిబ్బందితో కలిసి కార్యాలయంలో అన్ని విభాగాలను పరిశీలించామన్నారు. ఎవరు క్లెయిమ్ చేయని రూ.40,850ను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిబంధనల ప్రకారం ప్రయివేటు వ్యక్తులు కార్యాలయం ఉండకూడదని, ఇందుకు భిన్నంగా తుని కార్యాలయం దస్తావేజు లేఖర్లు, ప్రయివేటు వ్యక్తులతో నిండిపోయిందన్నారు. చాలామంది దగ్గర నగదు ఉందని, దీనిపై వారిని ప్రశ్నిస్తున్నామన్నారు. సబ్ రిజిస్ట్రార్ రాధాభాయితో పాటు ఉద్యోగులను విచారిస్తున్నామని, తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.



తుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ అడిషనల్ ఎస్పీ సౌజన్య

ప్రణాళిక ప్రకారం నిఘా

ఏసీబీ అధికారులు ఎవరికీ అనుమానం కలుగకుండా బుధవారం ఆర్టీసీ బస్సులో వచ్చారు. కార్యాలయం ప్రాంగణంలో సాధారణ దుస్తుల్లో నిశితంగా పరిశీలించారు. కార్యాలయానికి ఎక్కువగా వస్తున్న వ్యక్తులను గుర్తించారు. రైడ్ ప్రారంభం కాగానే కార్యాలయం ప్రధాన ద్వారాన్ని మూసివేశారు. ఉద్యోగులతో పాటు దస్తావేజు లేఖర్లు, ప్రయివేటు వ్యక్తులను తనిఖీ చేసి వారి దగ్గర ఉన్న నగదును స్వాధీనం చేసుకున్నారు. రికార్డు రూమ్, కంప్యూటర్ గది, స్టాంపులు విక్రయించే గదుల్లో తనిఖీలు చేశారు. ఏసీబీ తనిఖీలతో అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. అందరి నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు.

ఇంటర్ ఫలితాల్లో ఆదిత్య సత్తా



ఎస్.కృష్ణ తులసి



ఎన్.నవ్యశ్రీ



ఎన్.భాస్కరలక్ష్మి



ఎస్.సాత్విక

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంటర్‌మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యధిక శాతం ఉత్తీర్ణత సాధించారని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో ఎన్.భాస్కరలక్ష్మి 466, నలుగురు విద్యార్థులు 465, 25మంది విద్యార్థులు 464 మార్కులు సాధించారన్నారు. బైపీసీలో 440 మార్కులకు 432 మార్కులు ఎస్.సాత్విక, ఇద్దరు విద్యార్థులు 431, ఒక విద్యార్థి 430 మార్కులు సాధించారన్నారు. ఎంఈసీ విభాగంలో బి.వి.వి.వి.యు. శ్రీకృష్ణ తేజస్విని 500 మార్కులకు 488 మార్కులు, ఒక విద్యార్థి 487, ఇద్దరు విద్యార్థులు 486 మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో ఎస్.కృష్ణ తులసి 991, జె.భవ్యదత్తశ్రీ 989, బైపీసీ విభాగంలో ఎన్.నవ్యశ్రీ 989, ఎంఈసీ విభాగంలో టి.లక్ష్మీప్రియసాత్విక 981 మార్కులు సాధించి ప్రతిభ చూపారన్నారు. విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల కార్యదర్శి దీపక్‌రెడ్డి, వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, కో-ఆర్డినేటర్ లక్ష్మీకుమార్, డైరెక్టర్లు గంగిరెడ్డి, రాఘవరెడ్డి, ప్రిన్సిపాల్ మెయినాలు అభినందించారు.

నేడు నిధి ఆప్‌కే నికట్

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం ఈపీఎఫ్‌వో ప్రాంతీయ కార్యాలయం పరిధిలో గురువారం నిధిఆప్‌కే నికట్ జిల్లా ఔట్ రీచ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ వైడీ శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలోని ఎంఎస్ ఐటీసీ లిమిటెడ్‌లోను, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురం ఎంఎస్ బీవీసీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లోను, అల్లూరి సీతారామరాజు జిల్లాలో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ రిసోర్స్ సెంటర్‌లోను, కాకినాడ జిల్లాలో ఎంఎస్ కాకినాడ సీపోర్టు ప్రైవేట్ లిమిటెడ్‌లోను, ఏలూరు జిల్లాలో ఏలూరు ఈపీఎఫ్‌వో జిల్లా కార్యాలయంలోను, పశ్చిమగోదావరి జిల్లాలో భీమవరం ఈపీఎఫ్‌వో జిల్లా కార్యాలయంలో నిధి ఆప్‌కే నికట్ జరుగుతుందన్నారు. ఈనిధి ఆప్‌కే నికట్‌లో ఈడీఎల్ఐ అర్హత, లెక్కించడం, క్లెయిమ్స్, పాస్‌బుక్ ఖాతాలను ట్రాక్ చేయడం, ఇ-నామినేషన్ ఆవశ్యకత వంటి సేవలు అందిస్తారని చెప్పారు. నిధి ఆప్‌కే నికట్ అని పేర్కొంటూ తమ ఫిర్యాదులను సమర్పించాలని తెలిపారు.

మహిళల భద్రతే లక్ష్యంగా పనిచేయాలి

అమలాపురం టౌన్: జిల్లాలోని మహిళా పోలీసులు మహిళల భద్రత, ఆడపిల్లల రక్షణే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ సూచించారు. స్థానిక ఎస్పీ కార్యాలయం నుంచి ఏఎస్పీ కె.లతామాధురితో కలిసి జిల్లాలోని మహిళా పోలీసులతో జూమ్ యాప్ ద్వారా బుధవారం సాయంత్రం ఆయన మాట్లాడారు. ముఖ్యంగా గ్రామాల్లో ఒంటరిగా ఉంటున్న మహిళలకు మహిళా పోలీసులు రక్షణగా ఉండాలని ఎస్పీ సూచించారు. సోషల్ మీడియాలో మహిళలు, బాలికలపై అసభ్యకరమైన పోస్టులు వచ్చినప్పుడు తక్షణమే స్పందించి వాటి నిరోధానికి చర్యలు చేపట్టాలన్నారు.



జూమ్ యాప్ ద్వారా మాట్లాడుతున్న ఎస్పీ శ్రీధర్, ఏఎస్పీ లతా మాధురి

వెంకన్న ఆదాయం రూ.82.35 లక్షలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి హుండీలను బుధవారం లెక్కించగా రూ.82,35,872 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. 34 రోజులకు హుండీలను లెక్కించగా ప్రధాన హుండీల నుంచి రూ.62,77,350, అన్న ప్రసాదం హుండీల ద్వారా రూ.19,58,522 రాబడి వచ్చినట్లు తెలిపారు. తొమ్మిది విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయి. బంగారం 20 గ్రాములు, వెండి 414 గ్రాములు వచ్చినట్లు వివరించారు. ఆలయ క్షేత్ర పాలకుడు శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ హుండీలను 34రోజులకు లెక్కించగా రూ.2,13,451 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు, పలివెల ఉమా కొప్పేశ్వర స్వామి ఆలయ ఈఓ ఎన్‌విఎన్ఎస్‌వి ప్రసాదరాజు, పొడగట్లపల్లి ఉప్పలపాటి జానకీయమ్మ అన్నదానసత్రం ఈవో మీసాల రాధాకృష్ణ పర్యవేక్షణలో హుండీలను లెక్కించారు.

ఇంటర్‌లో తిరుమల విద్యాసంస్థల ప్రభంజనం

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఇంటర్ ఫలితాలలో రాజమహేంద్రవరంలోని తమ తిరుమల జూనియర్ కాలేజీ విద్యార్థులు అత్యద్భుత ఫలితాలు సాధించినట్లు తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 1,944 మంది పరీక్షకు హాజరుకాగా 1,931మంది ఉత్తీర్ణులై 99.33 శాతం ఉత్తీర్ణత సాధించారని, బైపీసీగ్రూపులో 486 మంది పరీక్షకు హాజరుకాగా 481మంది ఉత్తీర్ణులై 98.97శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఎంపీసీ విభాగంలో కె.నవ్యశ్రీ 991 మార్కులు, ఎం.హెచ్.యోగానందభారతి 990 మార్కులు, ఓఎస్ఎస్‌వీ.శ్రీనివాస్, జీఎస్ డేనియల్, ఏవీ సుభాష్, ఎస్‌వీఎస్‌బీ ఆశిష్‌రామ్, కేపీ శ్రీకళ్యాణ్, ఎ.సిరిచందన, జి.వాసవి మొత్తం ఏడుగురికి 989మార్కులు, 86మంది 985మార్కులుపైన, 278 మంది 980మార్కులు పైన 1,080 మంది 950మార్కులుపైన సాధించారన్నారు. బైపీసీ విభాగంలో ఎం.గంగతల్లి 990మార్కులు, డి.కార్తీక్ 989మార్కులు, పి.మహిమాన్విత 989 మార్కులు, జి.మేఘన 989మార్కులు, కె.శ్రీమధురిమ 989మార్కులు సాధించారని, 63మంది విద్యార్థులు 980 పైన, 131మంది విద్యార్థులు 970పైన, 232మంది 950పైన మార్కులు సాధించారని తెలిపారు.

జూనియర్ ఇంటర్‌లో..

జూనియర్ ఇంటర్ ఎంపీసీ గ్రూపులో 2,74 8మంది పరీక్షకు హాజరుకాగా 2,704మంది ఉత్తీర్ణులై 98.04శాతం ఉత్తీర్ణత సాధించారని, బైపీసీ గ్రూపులో 438మంది పరీక్షకు హాజరుకాగా 430మంది ఉత్తీర్ణులై 98.20శాతం సాధించారని నున్నతిరుమలరావు తెలిపారు. ఎంపీసీ విభాగంలో బీఎన్‌డీ మహేష్ 466 మార్కులు, వీవీబీఎన్ మణికుమార్ 466 మార్కులు, జి.సత్యనారాయణ, ఆర్.పవిత్ర, డి.నాగసాయి, బిఎస్ఎన్‌వి రమణ, పిఎస్.అభిష్, కెవివి.కృష్ణ, ఎం.ధనేష్, విటిడి భవానీ, కెబి.జాగృతి, కెవి.వెంకటేశ్వరి, కెఎల్ భావన, ఎస్.యశస్విని, టిఎస్.సమీక్ష, సిహెచ్ఎస్ లావణ్య, బీసీహెచ్.శ్రీహర్ష, ఎం.దిందుశ్రీ, కె.అమృతమాల మొత్తం 17మంది 465మార్కులు సాధించారని, 85మంది విద్యార్థులు 464పైన, 434మంది విద్యార్థులు 460పైన, 1185మంది విద్యార్థులు 450పైన, 2158 విద్యార్థులు 400పైన సాధించారన్నారు. విద్యార్థులను నున్న తిరుమలరావు, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ శ్రీహరి అభినందించారు.



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో అకడమిక్ డైరెక్టర్ సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ శ్రీహరి

రత్నగిరి సత్రం గదులకూ ఆన్‌లైన్ రిజర్వేషన్

అన్నవరం: సత్యదేవుని భక్తులకు శుభవార్త. రత్నగిరిపై గల శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం సత్రాలలో 50 శాతం గదులు ఆన్‌లైన్ రిజర్వేషన్ చేసుకునేందుకు వీలు కల్పిస్తున్నట్లు దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే స్వామివారి వ్రతం, దర్శనం, ప్రసాదం, నిత్యకల్యాణం టికెట్లు ఆన్‌లైన్‌లో లభిస్తున్న విషయం తెలిసిందే. సత్రం గదులను కూడా 50 శాతం వరకు ఆన్‌లైన్‌లో రిజర్వ్ చేసుకునే వీలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు రత్నగిరి సత్రాలలో గదులు కావాలంటే దేవస్థానానికి వచ్చి నగదు చెల్లించి తీసుకోవల్సిందే. అయితే దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇది ఇబ్బందిగా మారింది. దీంతో భక్తులు ఇంటి వద్ద నుంచే తమకు అవసరమైన రోజున సత్రం గదులు రిజర్వ్ చేసుకునే వీలు కల్పిస్తున్నట్లు తెలిపారు. www.aptemples.ap.g-ov.in వెబ్‌సైట్ ఓపెన్ చేసి గదులు బుక్ చేసుకోవచ్చునని తెలిపారు. సామాన్య భక్తుల కోసం రత్నగిరిపై సీతారామ సత్రం, కొండ దిగువన సత్యనికేతన్ సత్రంను ఆన్‌లైన్ రిజర్వేషన్ నుంచి మినహాయించారు.

ముమ్మిడివరప్పాడు సర్పంచ్ రేణుకాదేవి ఆత్మహత్య

రావులపాలెం: మండలంలోని ముమ్మిడివరప్పాడు గ్రామ సర్పంచ్ వర్రే రేణుకాదేవి(41) బుధవారం ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఘటనా ప్రాంతాన్ని రావులపాలెం ఎస్సై ఎం.వెంకటరమణ పరిశీలించి కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. రేణుకాదేవికి 20 సంవత్సరాల కిత్రం లక్ష్మీనారాయణతో ప్రేమ వివాహం అయ్యింది. వారికి తొమ్మిదో తరగతి చదువుతున్న ఒక కుమారుడు ఉన్నాడు. గత పంచాయతీ ఎన్నికల్లో గ్రామ సర్పంచ్‌గా రేణుకాదేవి వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థిగా గెలుపొందారు. కొంతకాలంగా భర్త లక్ష్మీనారాయణ మద్యానికి బానిసై, ఇటీవల అనారోగ్యం పాలయ్యాడు. దీంతో భర్తను ఎన్నిసార్లు తాగుడు మానమని అడిగినా వినిపించుకోకపోవడంతో మనస్తాపానికి గురైన రేణుకాదేవి ఆత్మహత్య చేసుకున్నారని, ఈ మేరకు ఆమె తండ్రి పెద్దింటి వీర్రాజు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.



సర్పంచ్ రేణుకాదేవి (ఫైల్)

గ్రామంలో విషాద ఛాయలు

గ్రామ సర్పంచ్‌గా అందరితో కలివిడిగా ఉండే రేణుకాదేవి ఆత్మహత్య చేసుకోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సర్పంచ్‌గా ప్రజలకు మంచి సేవలు అందిచడంతోపాటు, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ముందుండే రేణుకాదేవి మృతి తమ గ్రామానికి తీరని లోటు అని స్థానికులు అంటున్నారు.

250 కేజీల గంజాయి పట్టివేత



కోటనందూరులో గంజాయిని పట్టుకున్న పోలీసులు

కోటనందూరు: అక్రమంగా తరలిస్తున్న 250 కేజీల గంజాయిని పట్టుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పీవీసీ స్వామినాయుడు బుధవారం తెలిపారు. కోటనందూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సీపట్నానికి చెందిన కాశవరపు అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఐదుగురు గంజాయి ముఠా సభ్యులు అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి నుంచి వాహనంలో 25 కేజీల చొప్పున 10 బస్తాలు గంజాయిని తుని తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న తుని రూరల్ సీఐ సన్యాసిరావు, ఎస్సై స్వామినాయుడు తమ సిబ్బందితో రైడ్ చేసి అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్థానిక గొంపకొండ ప్రాంతంలో పట్టుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.5 లక్షలు ఉంటుంది. గ్యాంగ్ లీడర్ అరుణ్‌కుమార్ పట్టుబడగా మిగిలిన వారు పరారయ్యారు. ఈ ఘటనలో గంజాయి తరలిస్తున్న వాహనానికి ఎస్కార్ట్‌గా వెళ్తున్న పల్సర్‌బైక్, గంజాయి తరలిస్తున్న ఇన్నోవా కారును అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై స్వామినాయుడు తెలిపారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు

మండపేట: ఇంటర్ ఫలితాలు విడుదలైన నేపథ్యంలో ఫెయిల్ అవుతానని భావించి ఇంటి నుంచి విద్యార్థి అదృశ్యమైన ఘటనపై బుధవారం రాత్రి పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక వల్లూరి వీధికి చెందిన నూని ప్రశాంత్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం ఇంటర్ ఫలితాలు విడుదలైన నేపథ్యంలో ఫెయిల్ అవుతానన్న ఉద్దేశంతో ఇంటి నుంచి రూ.9,000 నగదు, నాలుగు జతల దుస్తులు తీసుకుని కనిపించకుండా వెళ్లిపోయినట్టు తండ్రి రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎం.అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 8332957926 నంబర్‌కి సమాచారం అందించాలని ఎస్ఐ అశోక్ కోరారు.



అదృశ్యమైన విద్యార్థి ప్రశాంత్

కాశీ నుంచి రామేశ్వరం వరకు సైకిల్ యాత్ర

ఆత్రేయపురం: కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా సింధునూరులో నివాసం ఉంటున్న చత్రాజుల విజయగోపాలకృష్ణ కాశీ నుంచి రామేశ్వరం వరకు 14 రాష్ట్రాల్లో సైకిల్ యాత్ర చేస్తూ బుధవారం వాడపల్లి చేరుకున్నారు. స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భారత దేశ శాంతిని, దేశంలో ప్రకృతి వైపరీత్యాల నుంచి దేశ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ యాత్ర చేస్తున్నట్లు తెలిపారు.



సైకిల్ యాత్ర చేస్తున్న విజయ గోపాలకృష్ణ